



దీపావళి కథల పోటీలో పాఠకుల నిర్ణయానికై ఎంపిక చేసిన కథ

# బినామీ

జనవరి ఫస్టు. తెల్లవారేసరికి కాలేజీ గ్రౌండు అంతా హడావిడిగా వుంది. విద్యార్థులు పరస్పరం గ్రీటింగ్స్ చెప్పుకొంటున్నారు. ఇంతలో నోడల్ ఆఫీసరు రంగాచార్యులు, ఎమ్.డి.ఓ. బలరామ్‌పాత్రో, మండలాధ్యక్షులు రామారావు కారు నుంచి దిగివచ్చారు. నోడల్ ఆఫీసర్ క్లుప్తంగా నాలుగుమాటలు చెప్పి 'ఇప్పుడు మన మండలాధ్యక్షులు రామారావు గారు మాట్లాడతారు' అంటూ మైకు అతని చేతికిచ్చారు. రామారావు గారు ఉపన్యాసం దంచేస్తున్నారు గాని ఎవరి హడావుడిలో వారు వుండడంచేత వినిపించుకొనే స్థితిలో లేరు. నాకు పదిమంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లను ఇచ్చారు. ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటరు నాకు ఎలాట్ చేసిన వాలంటీర్ల లిస్టు ఇస్తూ 'మీకు ఒక మంచి స్టూడెంటుని ఇచ్చాను. ఆవూరివాడే. లక్ష్మీనారాయణ కోటా డీలరు. మీకు కావలసినవన్నీ వాడే చూసుకొంటాడు 'అంటూ' మీరు మీ వాలంటీర్లతో సహా రెండో నెంబరు బస్సు ఎక్కండి అంటూ వెళ్ళిపోయాడు. నేను పేరుపేరున పిల్చుకొంటూ ఒక్కొక్కర్నే బస్సు ఎక్కిస్తున్నాను. తొమ్మండుగురే వున్నారు. లక్ష్మీనారాయణది ఆవూరేకదా! మీకు అక్కడే దొరుకుతాడు అంటూ రైట్ చెప్పాడు ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్. మా హేబిటేషన్లో దిగాం మూట, ముల్లెతో సహా;

ఆకలి దంచేస్తోంది. ఎడారిలో ఒయాసిస్‌లాగా ఒక పాక హోటలు కనిపించింది. వేడిగా ఏటివుందని అడిగాం. టీ వుందన్నాడు. తినడానికి ఇడ్లీ వుందిగాని, వేడిగా వుండదు. ఉదయం పెట్టిన ఇడ్లీ. ఒక్కొక్కరం నాలుగేసి ఇడ్లీలు తిని టీ తాగాం. పదిమందికీ బిల్లు చెల్లించాను. యాభై రూపాయల నోటిచ్చాను. సరిపోయిందన్నాడు.

పంచాయితీ ఆఫీసుకు వెళ్లాం. తలుపులు వేసున్నాయి. అరుగుమీద కూర్చొన్నాం. ఇంతలో ఎదురుగా మమ్మల్ని వెదుక్కొంటూ వస్తున్నాడు ఒకడు.

'రావోయ్ లక్ష్మీనారాయణ! నీకోసమే చూస్తున్నాం.'

నాపేరు లక్ష్మీనారాయణ కాదు. హరినారాయణ ఆదు మా అన్నయ్య.

మీ అన్నయ్యేడీ?

యమ్.ఆర్.ఓ. ఆఫీసుకు వెళ్లాడు. కోటా డీలరు కదండీ రోజూ పని వుంటాది.

ఎప్పుడొస్తాడు?

ఆడేరాత్రికో ఇంటికి చేరతాడు. మీ భోజనాలకి కోటా తెచ్చుకోవద్దా? పంచాయితీ ఆఫీసు తాళాలు తీసి ఒక సిటం కూకోండి. వంటలయ్యాయో లేదో చూసుకొని వస్తాను. అంటూ వెళ్ళిపోయాడు.

పంచాయితీ ఆఫీసు తుడిచినట్లు లేదు. పిల్లలే తుడిచి శుభ్రం చేశారు. వీధిలో ఎవరో ధాన్యం ఎగరబోస్తున్నారు. దుమ్మంతా విస్తళ్లలో పడుతూనే వుంది. సాంబారు అన్నం పిల్లలు సుష్టుగా తిన్నారు.

గ్రామ సర్పంచ్ కనబడలేదన్నాను.

ఆదు మా పెద్దన్నయ్య శివన్నారాయణ. టౌనుకు వెళ్లాడు. తీరిక వుండదు. బ్యాంకు పనులు, కాంట్రాక్టు పనులు ఆడికి చాలా వుంటాయి.

ఎప్పుడొస్తాడు?

రాత్రికొస్తే వస్తాడు. లేకపోతే రేపే. పార్టీలు వుంటాయి గదా! మీకేది కావలసినా నన్నడగండి అని చెప్తూ వెళ్ళిపోయాడు.

పనేం లేదు. సర్పంచ్ కనిపించడు.

తెల్లవారేసరికి సమస్య. చెరువెక్కడో కనుక్కొని బయలుదేరాం. అన్నిటికీ అదే చెరువు. తువాళ్లు భుజాలమీద వేసుకుని, టూత్‌బ్రష్, సబ్బుపెట్టె పట్టుకొని పరుగులాంటి నడకతో వెళ్తున్నాను. ఎదురుగా గోడమీద రాసిన "అత్యవసర సమయంలో గూడ ఆమడదూరం వెళ్లాల్సిందేనా?" అన్న అక్షరాలు వెక్కిరించాయి.

ఈరోజు కార్యక్రమం డ్వాక్రాగ్రూపుల పనితీరు సమీక్షించడం. వీళ్లకి ఒక కార్యాలయం లేదు. ఎక్కడా ఒక బోర్డులేదు. ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు. హెడ్‌మాస్టారు గారిని అడిగితే ఒక పిల్లవాడితో ఏదో చెప్పి 'వీడితో వెళ్లండి. మీకాయిల్లు చూపిస్తాడు' అన్నారు.

వాడితో కలిసి వెళ్ళాం. ఇంటికి తాళం వేసుంది. పేరు తెలుసుకున్నాం. సరస్వతి గ్రూపు ఆర్గనైజర్. సాయంకాలం అయింది. వస్తారనుకున్న కలెక్టరుగారు రాలేదు. రోడ్డు ప్రక్కన వున్న రెండు గ్రామాలు చూసుకొని వెళ్ళిపోయారట.

మర్నాడు సరస్వతి ఇంటికి వెళ్లాం. తలుపు వేసుంది. పెరటిలో నీళ్ళ శబ్దం వినిపిస్తోంది. పిలిచాం. కాసేపటికి తలుపు తీసుకొని వచ్చింది. విషయం చెప్పాం.



విశాఖపట్నంలో ఆగష్టు 22న విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల హిందీ శాఖాధ్యక్షులు, రీడర్ డా.వెన్నావల్లభరావు రచించిన 'భగవదీ చరన్ వర్మాకే ఉపన్యాసోం మేం వ్యక్తి ఔర్ సమాజ్' అను పరిశోధనా గ్రంధాన్ని ఆవిష్కరించినప్పటి దృశ్యం. చిత్రంలో ఎడమ నుంచి కుడికి శ్రీమతి నాగేశ్వరి, రచయిత డా॥ వెన్నా వల్లభరావు, ప్రొ॥ అశోక్ చక్రధర్, పద్మశ్రీ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శ్రీ అనీల్ జనవిజయ్, ప్రొ॥ కె. లీలావతి, డా॥ ఆర్. యస్ సర్రాజు.లు ఉన్నారు.

నెలనెలా మీటింగులు జరుగుతున్నాయా? ఎంత మంది సభ్యులు? గవర్నమెంటు ఎంత లోనిచ్చింది?

అన్నిటికీ ఒకటే సమాధానం. శివన్నారాయణ నడగండి. పోనీ బ్యాంకు పుస్తకాలు, మినిట్సు పుస్తకాలు ఇవ్వండి, అని అవి చూసి నట్లు మేం రాసుకోవాలి. అన్నాను.

రేపురండి. చూసి ఇస్తాను, అంది.

రెండు రోజులు గడిచాయి. సరస్వతి పుస్తకాలు ఇవ్వలేదు. పదే పదే అడిగితే ప్రెసిడెంటు శివన్నారాయణదగ్గరే వున్నాయి. నేను అడిగాను, గాని యివ్వలేదు. రేపు మీరు అడిగి తీసు కోండి అని చెప్పింది.

మర్నాడు యం.డి.ఓ. వస్తారని అన్నారు గాని అతనికి బదులు సీనియర్ అసిస్టెంట్ మురళి వచ్చాడు. కొన్ని ఫారాలిచ్చి అర్జంటుగా ఇవి పూర్తిచేసి రేపు సాయంకాలంలోగా ఆఫీసుకు పంపించండి. అర్జంటు. గవర్నమెంటుకు పంపించాలి అన్నాడు. గ్రామ సర్పంచ్ శివన్నారాయణ వచ్చాడు. అతనింట్లోనే లంచ్. వాళ్ళు లంచ్ చేసుకొని వచ్చేసరికి ఫారాలు నింపడం పూర్తిచేశాం.

జీపు వెళ్ళిపోయింది. ప్రెసిడెంటుకు నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. పంచాయితీ ఆఫీసులో కూర్చున్నాం. ఫారాలిస్తూ వాటి మీద సంతకాలు చెయ్యాలని చెప్పాను. అన్నీ చూశాడు.

మాస్టరుగారూ! ఫైలు ఇవ్వండి. సంతకాలు చేసి రేపు పంపిస్తాను. మీరు మళ్ళీ మాకు దొరకరు. అర్జంటని మురళీ అంటున్నాడు. గవర్నమెంటుకు పంపాలట కదా!

మీకెందుకు. రేపు తెల్లారేసరికి ఫైలు మీ చేతిలో వుంటుంది, అంటూ ఫైలు తీసుకొని వెళ్ళిపోయాడు శివన్నారాయణ. వెళ్ళిపోతున్న శివన్నారాయణని డ్వాక్రా పుస్తకాలు, ఎకౌంట్లు గురించి అడిగాను. ఫైలుతోపాటు పంపిస్తా నన్నాడు.

లక్ష్మీనారాయణ అలికిడి లేదు. రామమోహన్‌ని అడిగితే 'మా గ్రూపే సార్! ఎప్పుడో వస్తుంటాడు. వెనక కూర్చొంటాడు. ఎప్పుడు వెళ్ళిపోతాడో తెలీదు. చాలా బిజీ అన్నాడు.

మరి ఎటెండెన్సో! ఇలాంటి ప్రశ్న వేశానని నవ్వుకొన్నాను.

సర్పంచ్ ఫైలు పంపలేదు. మురళీ గూడ రాలేదు.

రెండురోజుల తర్వాత హరినారాయణ ఫైలు పట్టుకొని వచ్చాడు. డ్వాక్రా పుస్తకాల గురించి అడిగాను. మా అన్నయ్య ఇదే ఇచ్చాడు అన్నాడు.

ఇంటికి వస్తాను పద.

ఆదు టౌను వెళ్ళిపోయాడు.

ఫైలు సరిగా వుందో లేదో, అన్ని

కాగితాల మీద సంతకాలు వున్నాయో లేదో చూసుకొంటున్నాను. సంతకం రోజారాణి అని అందంగా కనిపిస్తుంది. మళ్ళీ అన్ని కాగితాలూ చూసుకొన్నాను. అన్నిటిమీద ఒక్కలాగే రోజారాణి అనే వుంది.

ఫైలు పట్టుకొని హెచ్.యమ్. గారి దగ్గరకు వెళ్ళాను. శివన్నారాయణ ఎక్స్-సర్పంచ్. ఈసారి ఈ పంచాయితీ మహిళలకు కేటా యించడంతో శివన్నారాయణ తనకు బదులుగా ఎమ్.డి.ఓ. ఆఫీసు అటెండరు అప్పారావు భార్యను నిలబెట్టాడు. గతసారి ఏకగ్రీవంగా ఎన్నికైనా, ఈసారి పోటీ తప్పలేదు. శివన్నా రాయణ గత అయిదేళ్లలో బాగా ఆస్తిని, కొందరు వ్యతిరేకుల్ని సంపాదించుకొన్నాడు. ఉపసర్పంచ్ అయినా వ్యవహారాలన్నీ శివన్నారాయణే చూసుకొంటాడు. ఆఫీసుల చుట్టూ తిరుగు తుంటాడు. సర్పంచ్ ఇంట్లోనే భోజనం.

ఆఖరిరోజు గ్రామసభ. పెద్ద హడావిడి లేదు. చిన్న షామి యానా వేశారు. ఐదు కుర్చీలు వేశారు. ముందు ఒక జీవు వచ్చింది. దాని వెనక ఒక మారుతీ కారు. శివన్నారాయణ గ్రామ సర్పంచ్ రోజా రాణిని, నోడల్ ఆఫీసర్ రంగాచార్యుల్ని, మండలాధ్యక్షులు రామారావుని, ఎమ్.డి.ఓ. బలరామ్ పాత్రోనీ వేదిక మీదకి ఆహ్వానించాడు. వితంతువులకు, వృద్ధులకు, వికలాంగు లకు పెన్షన్ల పంపకం జరుగుతుంది. కొన్ని సర్పంచ్ చేతుల మీదగాను, మరికొన్ని మండ లాధ్యక్షుల చేతుల మీదుగాను.

రోజారాణి తెల్లగా,సన్నంగా, నాజూగ్గా వుంది. ముప్పైలోపే వుండవచ్చు.చిన్నవయస్సు లోనే రాజకీయాలలో రాణించడం వల్ల మంచి భవిష్యత్తు వుండొచ్చు అనుకొన్నాను.

"దీనికిదే ఆఖరి మీటింగు" అన్నారెవరో వెనుక నుండి మెల్లగా.

చెట్టునీడన మొక్కలు ఎదగవు. శివ న్నారాయణ ఎలాటోడో మనకి తెలీదా?

'ఆ అమ్మరాలేదేటి?' అని చివరన కూర్చొన్న ఆడవాళ్లు గుసగుసలాడుకొంటున్నారు.

'ఈ అమ్మలాగ ఆ అమ్మకి కారుల్లో తిరగాలనీ, మీటింగుల్లో కూకోవాలనీ సరదా వుండాలి కదా! ఎంతైనా పెద్దింటి బొట్టి కదా!" అని ఒక వయసు మళ్ళిన ఆవిడ అంటుంది.

ఆ రెండో ఆవిడ ఎవరో నాకు బోధ పడలేదు. మీటింగ్ అయిపోయి అందరూ కారుల్లో బయలుదేరాక హెడ్‌మాస్టరు గారిని అడిగాను - ఆ రెండో ఆవిడ ఎవరని.

రామారావు గారి భార్య - సీతాలక్ష్మి. ఈ మండలానికి అధ్యక్షురాలు.

# తాజా రాజీ పేజీ !

అక్కడ -
అసహ్యం అసహ్యమూకాదు
సహనం సహనంగానూ తోచదు
అంతాకలిపి అదొక బండెడు బతుకంతటి ఉక్కబోత

శతాబ్దాలకు సరిపడా నరకయాతన
ఒక నిరాయుధమైన అప్రకటిత యుద్ధం
ఒక మూగ పెనుగులాట
కడుపునిండా పేరుకుపోయిన ఆక్రోశం
కకావికలమైన మనస్సంతా కరిగి -
కన్నీరై ప్రవహించటమే గాని
పెదవిదాటని బాధాతీవ్రత !
కానయితే అతడు యజమానీ కాడు
పిలవబడటానికి తాను అచ్చంగా బానిసా అవదు
మనువాదేశించిన దండమూ అగుపించదు
స్పష్టంగా - ఒంటి నిండా గాయాలకూ కొదవుండదు
అంతా ప్రశాంతంగానే తోస్తూ వుండటం
పదిలపడాల్సిన ఆనందమూ - తృప్తీ అనేవన్నీ
మాళక్కి - మాళక్కే అవుతూండటం
అదో పెద్దరివాజు !
సంసారానికేం ? -
దాని దారిన అది గడిచిపోతూనే వుంటుంది
ఇంట్లో సందడికేం ? -
వచ్చేవాళ్ళు వస్తూ -
పోయేవాళ్ళు పోతూనేవుంటారు
రోడ్లనిండా పరచుకుపోయే దుర్మార్గం
అంతో ఇంతో ఎంతగానో
గదుల నిండా తిష్టవేసుకుంటూనే వుటుంది
మాటకూడా ఒక అధునాతన సైగగా
రూపు కడుతూ వుంటుంది
ఎడం - ఎడం - ఎడమే ఎల్లెడలా
కురుస్తూ వుంటుంది
ఆలింగనాలూ - పరిష్వంగాలూ ఏ పేర్లయితేనేం?
చిక్కని మాంత్రికతకు ఒలికిన నీడగా విస్తరించటం
కమిలిన అందంగా కాలచక్రం దొర్లటం !

కలలోనికలగా -
కరిగిపోయే దాంపత్యమంతా కలిపి
బిక్కు బిక్కుమనే పిల్లల మధ్య
ఆడుకుంటూ కెలికే పగటి చీకటి
రాత్రుళ్ళ పొడవునా వెగటు వాసన
ఒక దీర్ఘ మౌనం ముందూ వెనుకా మౌనం
ఒక రాజీకాని రాజీ అయిన రాజీ
తాజా అవుతూనే -
పాత గాయాల రాజీ
శిథిలమై జీర్ణమౌతున్న
అనుబంధాల పేజీ !

- వేణు సంకోజు